క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు



లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు చేస్తున్న అర్చకుడు

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన ఉన్న లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో భక్తులతో ఘనంగా ముడుపుల పూజలు జరిగాయి. ప్రతివారం జరుగుతున్న ముడుపుల పూజల్లో భాగంగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొంటున్నారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామివారిపై ఉన్న విశ్వాసం కొద్దీ విశాఖ, అనకాపల్లి, రాయగడ రాయ్‌పూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి లోకకల్యాణార్థం నిర్వహించే అభిషేకాలు, ముడుపుల పూజల్లో పాల్గొంటున్నారని తెలియజేశారు. భక్తులందరికీ నిర్వాహకులు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

మూడోరోజూ జరిగిన యోగా కార్యక్రమాలు



స్థానిక ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్న సచివాలయ ఉద్యోగులు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడోరోజూ జరిగిన యోగా శిక్షణ తరతగతులను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు యోగా విద్యను అలవర్చుకుని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చేసిన సర్వేలో గుర్తించిన యువతీ యువకులకు యోగాను బోధించాలని కోరారు. యోగా చేయడం వల్ల ప్రజలకు కలిగే ఆరోగ్యపరమైన ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ,మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, డీఆర్పీలు పాల్గొన్నారు.


శ్రీరామాలయ ప్రతిష్ట ప్రారంభం



ప్రతిష్ఠా మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న అర్చకులు, పెద్దలు

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామంలో శ్రీరామాలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. అందులో భాగంగా గురువారం యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభించి శ్రీ మహాగణపతి పూజ, సంకల్పం, పుణ్యావహచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, యాగశాల ప్రవేశం, సంస్కారం, అంకురారోహణ, నవగ్రహ, యోగిని, వాస్తు, క్షేత్రపాలక సర్వతో భద్ర మంటప, మండల ఆవాహనములు, ఆరాధనలు, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వర్షంలో ఉపాధి కూలీలు



గురువారం వర్షంలో ఇంటికి వెళ్తున్న ఉపాధి కూలీలు

సాలూరు రూరల్: మండలంలో గురువారం ఉదయం కురిసిన వర్షం కారణంగా ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు పని వదిలి ఇంటి బాట పట్టారు. ఈ క్రమంలో మామాడిపల్లి బ్రిడ్జి ప్రక్కన నది ఒడ్డున పనిచేస్తున్న కూలీలు ఒక్కసారిగా బ్రిడ్జిపైకి వచ్చి వారి వద్ద ఉన్న తట్టలు, గమేళాలు తలపై కప్పుకుని ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. ఉపాధి కూలీల్లో చాలా మంది చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు ఉండడంతో ముందస్తు తొలకరి జల్లులతో వారి ముఖాల్లో ఆనందం కనిపించింది. ప్రభుత్వం రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వాయిదా వేసినప్పటికీ ప్రకృతి మాత్రం ముందస్తుగానే వ్యవసాయ పనులకు సహకరించిందని ఉపాధి కూలీలు పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎంల బదిలీ

రేగిడి: మండలంలోని దేవుదల, లక్ష్మీపురం ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు రాజ్యలక్ష్మి, నిమ్మక కృష్ణా రావు బదిలీఅయ్యారని ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు గురువారం తెలిపారు. దేవుదల హైస్కూల్‌కు కంచిలి నుంచి ఎస్.సీతారాం నాయుడు, లక్ష్మీపురం హైస్కూల్‌కు వజ్రపుకొత్తూరు నుంచి కామేశ్వరరా వు బదిలీపై వచ్చారని ఎంఈఓ చెప్పారు.

297వ కిలోమీటర్ వద్ద ప్రారంభించిన అండర్‌గ్రౌండ్‌బ్రిడ్జి పనులు





చినభోగిలి వద్ద నిర్మాణం పూర్తి కావచ్చిన అండర్‌గ్రౌండ్ రోడ్

రైల్వే గేట్లున్న ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ రోడ్లు

- సీతానగరం-బొబ్బిలి మధ్య మూడు రోడ్ల నిర్మాణం

సీతానగరం: కేంద్రప్రభుత్వం రాయపూర్–విశాఖపట్నం మీదుగా పెంచిన ట్రైన్ల రాకపోకలు పెరుగుతున్న రద్దీ కారణంగా తరచూ పడుతున్న రైల్వేగేట్లతో వాహనచోదకులు పడుతున్న దృష్ట్యా వారి విలువైన సమయం వృథా కాకుండా నివారించడానికి ప్రత్యేక శ్రద్ధతీసుకుంది. ఈ మేరకు అండర్‌గ్రౌండ్ రోడ్ల నిర్మాణం చేపట్టడానికి రైల్వేశాఖ ఉన్నతాధికారులు అండర్ గ్రౌండ్ రోడ్ల నిర్మాణాల పనులు ప్రారంభించారు. చినభోగిలి రైల్వే గేటును దాటుకుని నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడుతున్నాయి. ట్రైన్‌ల సంఖ్య పెరడంతో నిరంతరం గేటు పడడం వల్ల వందలాది వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మూడు నియోజకవర్గాలకు సంబంధించిన వందలాది వాహనాలు తిరుగాడే రోడ్డుపై 2023-24 ఆర్థిక సంవత్సరంలో అండర్‌గ్రౌండ్ రోడ్డు నిర్మించాలని సంకల్పించడంతో 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రాయగడ నుంచి విశాఖ వరకూ థర్డ్ రైల్వేలైన్ వేయడంతో పాటు ప్రజల అవసరాలను బట్టి మూడు రోట్ల అండర్‌గ్రౌండ్ రోడ్ల నిర్మాణానికి పనులు జరుగుతున్నాయి. గతంలో అప్పయ్యపేట వద్ద రైతుల వ్యవసాయ ఉత్పత్తులను తరలించడానికి అండర్‌గ్రౌండ్ రోడ్డు నిర్మించారు. అలాగే చిన భోగిలి కాలనీని ఆనుకుని ఉన్న ప్రాంతంలో అండర్ గ్రౌండ్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఆర్ వెంకంపేట రహదారిలో అండర్‌గ్రౌండ్ రోడ్డు నిర్మాణం ప్రారంభించడానికి రైల్వే అధికారులు ముడిసరుకు సిద్ధం చేశారు. లచ్చయ్యపేట వద్ద అండర్ గ్రౌండ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. గేట్ల స్థానంలో అండర్ గ్రౌండ్ రోడ్లు నిర్మాణంతో వాహనాలతో రాకపోకలు చేస్తున్న వారు, కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న వారి బాధలకు ఉపశమనం కలగనుంది. అండర్‌గ్రౌండ్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసి రోడ్డుపై నీరు నిల్వ లేకుండా ఆరంభం నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని ఆయాగ్రామాల ప్రజలు రైతులు, వ్యాపార వేత్తలు కోరుతున్నారు.



రైల్వేగేటు పడడంతో ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

గోతులమయమైన మామిడిపల్లి ప్రధాన రోడ్డు



గోతుల మయమైన మామిడిపల్లి ప్రధాన కూడలిలోని రహదారి

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ప్రధాన కూడలి రహదారి గోతులమయం కావడంతో గ్రామ ప్రజలతో పాటు నిత్యం ఆ గ్రామం మీదుగా వచ్చి వెళ్లే వాహన చోదకులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు ప్రధాన కూడలి కావడంతో నిత్యం వ్యాపార కార్యకలాపాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు వర్షం పడితే గోతుల్లో నీరు చేరి వాహనప్రయాణాలకు ప్రమాదకరంగా మారింది. నిత్యం జనంతో నిండిన ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లేటప్పుడు గోతుల్లో బురదనీరు తుళ్లడం ఇక్కడి ప్రజలకు సర్వసాధారణంగా మారింది. ఎండలు తీవ్రంగా ఉంటే ఈ గోతుల్లో మట్టి వల్ల భారీ వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము ధూళి గాలి లేచి స్థానికులతో పాటు ఇక్కడికి వచ్చే ఇతర గారమాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోతున్నారు. మండలంలోని ఏ కార్యక్రమానికైనా ఈ గ్రామం మీదుగా వెళ్తున్న గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి రోడ్ల పండుగలో భాగంగా ఈ రహదారిని గుర్తించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి వేతనదారులను పస్తులతో ఉంచకండి



వెంగాపురం సంతతోట వద్ద రామన్న చెరువు పని వద్ద నిరసన తెలుపుతున్న వేతనదారులు

బలిజిపేట: ఉపాధివేతనదారులను పస్తులతో ఉంచవద్దని, వారికి రావాల్సిన బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ వేతనదారులు పనివద్ద గురువారం నిరసన తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో వెంగాపురంలో రామన్న చెరువు పనివద్ద నిరసన తెలియజేశారు. ఎనిమిది వారాలవుతున్నా డబ్బులు జమ కాకపోవడంతో ఆకలిమంటలతో అలమటించిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, గిరిజనులు, బీసీలు ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఆకలిమంటలను తీర్చుకోవడానికి ఉపాధిపనికి వస్తుంటే పని డబ్బులు వారాల తరబడి బకాయిలు పేరుకుపోతే ఇల్లు గడిచేదెలా, ఆకలిమంటలు తీరేదెలా అని వాపోతున్నారు. వెంటనే బకాయి బిల్లులు చెల్లించాలని, పనివద్ద మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించకపోతే ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు తెలిపారు. కార్యక్రమంలో వేతనదారులు పాల్గొన్నారు.

దళితులు, మైనార్టీలపై బాబు సర్కార్ థర్డ్ డిగ్రీ

- వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నరివిశెట్టి శ్రీనివాసరావు



పార్వతీపురం రూరల్: దళితులు, మైనార్టీలపై రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ బహిరంగంగానే థర్డ్‌డిగ్రీ ప్రయోగిస్తోందని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నరివిశెట్టి శ్రీనివాసరావు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ తెనాలిలో ఇద్దరు దళితులు, ఒక మైనార్టీ యువకుడిపై పోలీసులు అత్యంత దారుణంగా ప్రవర్తించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం బాధాకరమన్నారు. రాజ్యాంగ విలువలను రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తూ మానవ హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. అంతులేని అధికారంతో దళితులు, మైనార్టీలు, గిరిజనులు, బీసీల హక్కులను పోలీసులు గౌరవించకుండా టీడీపీ ప్రవేశపెట్టిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడం దారుణమన్నారు. లాఠీలతో కొడుతుంటే వారు బాధతో అరుస్తున్నా నవ్వుతూ పోలీసులు మళ్లీ అదే పనిగా పాశవికంగా దాడిచేయడం అన్యాయమన్నారు. బూటు కాళ్లతో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తొక్కి పట్టగా, మరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లాఠీలతో దాడిచేశారన్నారు. అక్కడ మిగిలిన సిబ్బంది ఈ దాడిని వీడియో తీశారని, లాఠీ విరిగిపోతే నవ్వుతూ కొత్తవి అందజేశారన్నారు. ఈ ప్రభుత్వంలో ఎంతటి భయానక వాతావరణం రాష్ట్రంలో నెలకొందో చెప్పడానికి ఇదో ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ఇలాంటి ఎన్నో దారుణ, దాడులు రాష్ట్రమంతటా జరుగుతునే ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తే కూటమి సర్కార్ థర్డ్ డిగ్రీ బలహీన వర్గాలపై ప్రయోగిస్తోందని మండిపడ్డారు.

రేషన్ పంపిణీలో అవతవకలకు పాల్పడితే చర్యలు

రామభద్రపురం:

రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని రేషన్ డీలర్లను తహసీల్దార్ ఏ.సులోచనరాణి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో రేషన్‌డీలర్లతో సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణతో కలిసి గురువారం సమావేశం నిర్వ హించారు.ఈ సందర్భంగా తహసీల్దార్, సీఎస్‌డీటీ మాట్లాడుతూ ఇకపై రేషన్ సరుకులను పాత విధానంలో రేషన్ దుకాణాల్లోనే చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. రేషన్ లబ్ధిదారుల్లో 65 ఏళ్ల పైబడిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు మాత్రం తప్పనిసరిగా ఇళ్ల వద్దకే సరుకులు అందించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాల్సిందేనన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి సరుకులు అందజేయాలన్నారు.ఎండీయూ ఆపరేటర్ల నుంచి ఈపాస్ యంత్రం ,కాటా,ఐరిస్ పరికరాలను స్వాదీనం చేసుకోవాలని ఆదేశించారు.

అంతర పంటల సస్యరక్షణపై అవగాహన



మామిడిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సాలూరు రూరల్: మండంలోని కురుకుట్టి, మామిడిపల్లి, తోణాం గ్రామాల్లో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం రస్తా కుంటుబాయి వారి ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్‌లో అంతరపంటలు, జీడితోటల్లో అంతర పంటలు, అరటిలో చీడపీడలపై అవగాహన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి మూడు గ్రామాల్లో రైతులకు వ్యవసాయ సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఐసీఏఆర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, వ్యవసాయ విభాగం నుంచి మధుసూదనరావు, డాక్టర్ తేజేశ్వరరావు డా.సన్యాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్తలు సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 29 నుంచి వచ్చేనెల 12వ తేదీవరకు జరగనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ దోహదం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని మహిళలు స్వయం ఉపాధి పొందడానికి కుట్టుమిషన్ శిక్షణపై దృష్టిసారించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బీసీ కార్పొరేషన్ ప్రతినిధి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందడానికి కుట్టు శిక్షణ దోహద పడుతుందన్నారు.

ఇప్పటికే మండలంలోని పలుగ్రామాల నుంచి 123 మంది మహిళలు కుట్టు శిక్షణ పొందడానికి దరఖాస్తు చేసుకున్నారని తెలియజేశారు. అందులో ముందుగా 67 మందికి గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభించారన్నారు. వారంతా 90 రోజులు శిక్షణ పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమార వర్మ,శిక్షకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 316 మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

బొబ్బిలి: స్థానిక శ్రీ షిరిడీ సాయి డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. బాడంగి, సీతానగ రం , మక్కువ,బలిజిపేట, గజపతినగరం ప్రాంతాల నుంచి 598 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు.వీరికి 19 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి, 316 మందిని ఎంపిక చేశారని ఎస్‌డీఓ ప్రశాంత్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు తెలిపారు. అధ్యాపకులు సొంగలి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై వర్షపునీటితో ప్రయాణికుల ఇక్కట్లు



పార్వతీపురం-రాయగడ అంతర్‌రాష్ట్ర రహదారి దుస్థితి

పార్వతీపురం రూరల్:

చిన్న చినుకుపడితే రోడ్లు చెరువులను తలపించే విధంగా మారుతుండడంతో వర్షపునీటితో వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంటోంది. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణాల్లో గల ప్రధాన, బైపాస్ రహదారుల్లో సగం వర్షపు నీటితో రహదారులు నిండి వాహన చోదకులు రహదారిపై వెళ్లేందుకు అంచనా వేయలేని విధంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వర్షపునీటిలో రహదారిపై ఏర్పడిన గుంతలు ఎంత పరిమాణంలో ఉన్నాయో అంచనా లేక అదుపుతప్పి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి ఇచ్చిన హామీ నేటికీ ఆచరణకు నోచుకోకపోవడంతో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. అంతేకాకుండా వర్షాలు ప్రారంభం కావడంతో అక్కడక్కడ రహదారిపై ఉన్న గుంతలు మరింత పరిమాణంలో భారీ గుంతలుగా ఏర్పడి భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.



పార్వతీపురం మండల ప్రాంతానికి వెళ్లేందుకు ఉపయోగపడే ప్రధాన రహదారి దుస్థితి



పార్వతీపురం బైపాస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

తియ్యని విషం..!

- త్వరగా పక్వానికి వచ్చేలా వ్యాపారుల అడ్డదారులు
- యథేచ్ఛగా కార్బైడ్ వినియోగం



మార్కెట్‌లో లభిస్తున్న మామిడి పండ్లు

పార్వతీపురం: తీపిని పంచాల్సిన పండ్లు కడుపులో విషాన్ని నింపుతున్నాయి. మామిడి ప్రియుల ఆరోగ్యంపై దాడి చేస్తున్నాయి, సహజసిద్ధంగా పండాల్సిన పండ్లను కృత్రిమ పద్ధతిలో (త్వరగా పండేలా నిర్దేశిత ప్రమాణాలకు మించి కాల్షియం కార్బైడ్ వినియోగం) మగ్గబెడుతున్నారు. కంటికి అందంగా కనిపించేందుకు వ్యాపారులు వ్యాక్స్, సింథటిక్ కలర్లు అద్దుతున్నారు. వెరశి తరచూ వాటిని కొనుగోలు చేసి తిన్నవారికి ఆరోగ్య సమస్యలు (జీర్ణకోశ, శ్వాసకోశ, నాడీ సంబంధిత సమస్యలు, చర్మంపై దద్దుర్లు) వచ్చే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు మార్కెట్‌లలో తనిఖీలు నిర్వహించాల్సిన మార్కెటింగ్, ఫుడ్ సేఫ్టీ అధికారులు, తూనికలు కొలతల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో వ్యాపారులు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌కు వచ్చిన కాయలను త్వరగా మగ్గించి, అంతే త్వరగా సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో మోతాదుకు మించి రసాయనాలు వాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

రుచీ పచీ లేక..

విపరీతమైన మంచు కారణంగా పూత దశలోనే చాలావరకు పంట దిగుబడి తగ్గింది. అంతో ఇంతో కాసిన కాయలు ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షాలకు నేల రాలాయి. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. మామిడి కాయలను వివిధ రసాయనాలు వినియోగించి మగ్గబెడుతున్నారు. గతంలో రూ.30కు విక్రయించిన మామిడి పండ్లు ఈఏడాది రూ. 50కి విక్రయిస్తున్నారు. కంటికి అందంగా, సువాసన వెదజల్లే ఈపండ్లను తినేందుకు పిల్లలతోపాటు పెద్దలు సైతం ఇష్టపడుతున్నారు. ధర ఎక్కువగా ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తున్నారు. తీరా తిన్న తర్వాత రుచి లేకపోవడంతో ఉసూరు మంటున్నారు.

ఏది సహజమో? ఏది కృత్రిమమో..?

సహజంగా పండిన పండు ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగు మిశ్రమంతో కనిపిస్తుంది. ఇది సువాసన వెదజల్లడంతోపాటు పుల్లగా, తియ్యగా, రుచిగా ఉంటుంది. నీళ్లలో వేస్తే మునిగిపోతుంది. రసాయనాలతో పండిన పండుకు ఎలాంటి వాసన ఉండదు. పూర్తిగా పసుపు రంగులో కనిపించడంతో పాటు నీటిలో ఇట్టే తేలిపోతుంది.


రసాయనాలతో అనర్థం

మామిడి పండ్లను త్వరగా మగ్గబెట్టేందుకు కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తుంటారు. ఎఫ్‌ఎస్ఎస్ఏఐ వంటి సంస్థలు సైతం దీన్ని నిర్దేశిత ప్రమాణాల్లో వాడుతుంటాయి. మెజార్టీ వ్యాపారులు మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే కార్బైడ్‌ను వినియోగిస్తుంటారు. కార్బైడ్‌లో ఆర్సెనిక్, పాస్పరస్ అవశేషాలు ఉండటంతో జీర్ణకోశ, శ్వాసకోశ, నాడీ సంబంధిత వ్యాధులు వస్తాయి.

జిల్లాలో 4వేల హెక్టార్లలో సాగు

పార్వతీపురం మన్యం జిల్లాలో 4వేల హెక్టార్లలో మామిడి పంటను సేద్యం చేస్తున్నారు. హెక్టారుకు సరాసరి నాలుగు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది పంట పూత ఆలస్యంగా రావడం ఇతరత్రా ప్రకృతి వైపరీత్యాల ప్రభావం మామిడి పంట దిగుబడిపై ప్రభావం చూపాయి. హెక్టారుకు ఒక టన్నుకు మించి దిగుబడి రాని పరిస్థితి ఉంది. దీంతో మామిడి రైతులు నష్టాలలో ఉండగా, మామిడిపండ్లు తినే ప్రియులకు ధరలు అమాంతం పెంచేశారు. మంచి రంగుతో పాటు కళకళలాడేలా మామిడి కనిపించేలా అవసరమైన రసాయన చర్యలను వినియోగిస్తున్నారు. నిషేధిత రసాయనాలు వాడుతున్నారు. ఫలితంగా ఇవి రోగాలను ప్రోత్సహించేవిగా మారుతున్నాయి. పార్వతీపురం, పాలకొండ తదితర ప్రాంతాలలో మామిడి పండ్లకు ప్రత్యేక మార్కెట్లున్నాయి.

ఆరోగ్యంపై ప్రభావం..



కలుషిత రసాయనాలు, నిషేధిత రసాయనాలు వినియోగించి ముగ్గబెట్టిన పండ్లను ప్రజలు తినరాదు. అలా వాటిని కొనుగోలు చేసి తింటే జీర్ణకోశ, నాడీసంబంధిత వ్యాధులు వస్తాయి. రంగు మార్చేందుకు పండ్లను ప్రమాదకర రసాయనాలతో మాగబెడుతుంటారు. తినేముందు పరిశీలించి తినాలి.

డాక్టర్ ఎస్.భాస్కరరావు,
డీఎంహెచ్ఓ, పార్వతీపురం మన్యం జిల్లా

విదేశాంగ విధానాన్ని ట్రంప్ వద్ద తాకట్టుపెట్టారు

బొబ్బిలి: ఉగ్రవాదాన్ని అంతం చేస్తానని ఆపరేషన్ సింధూర్‌ను ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన వెంటనే సింధూర్‌ను ఆపేయడం మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని తాకట్టు పెట్టినట్టేనని సీపీఎం పట్టణ అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. పాక్ ఉగ్రదాడిని ఖండిస్తూ స్థానిక తాపీ పనివారి సంఘ భవనంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడి అత్యంత దుర్మార్గమన్నారు. జాతి, కులమతాల బేధం లేకుండా ప్రపంచ దేశాలన్నీ ఈ దాడిని ఖండిస్తున్నాయన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ ఉగ్రమూకలు ఎక్కడున్నా వెతికి పట్టుకుంటామన్న ప్రధాని మోదీ నేటికీ ఆ నలుగురు ఉగ్రవాదులను పట్టుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మెరిగాని గోపాలం మాట్లాడుతూ ఉగ్రదాడిని అడ్డం పెట్టుకుని దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, పీకేఎస్ నాయకులు తమటాల అప్పలనాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. అప్పన్న,ఇఫ్టూ నాయకులు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.